
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం : 10 : జూన్ : 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 37.325 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 100 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.61,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,514
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,679
నవర (8 గ్రా) -	రూ.45,432

గరిష్టం/కనిష్టం
41.2 /31.5

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 37 శాతం ఉంది. శనివారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని. వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

డిప్యూటీ డీఈఓగా ప్రసన్నలక్ష్మి



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసన్నలక్ష్మి

నెల్లూరు(టౌన్): నెల్లూరు డిప్యూటీ డీఈఓగా ఎం.ప్రసన్నలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో మోడల్ స్కూల్స్ ఏడీగా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి బదిలీపై నెల్లూరుకు వచ్చారు.

అధికారుల మధ్య సమన్వయం ఉండాలి

- ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కర్



మాట్లాడుతున్న ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థ ప్రగతి పథంలో నడవాలంటే డిస్కం(ఏపీఎస్పీడీసీఎల్), ట్రాన్స్‌కో అధికారుల మధ్య సమన్వయం ఉండాలని ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో డిస్కం, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సరఫరా విషయంలో ట్రాన్స్‌కో, డిస్కంల మధ్య ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్, ఎస్ఈలు శ్రీనివాస్, శివనాగమల్లేశ్వరరావు, డిస్కం ఈఈలు, డిప్యూటీ ఈఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలతో విద్యాస్థాయి పెంపు



ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): భాష, గణితం అభ్యసన సామర్థ్యాలతో విద్యాస్థాయిని పెంపొందించవచ్చని సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జిల్లాస్థాయి జన్ భాగీదరి ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు కళాత్మకమైన బోధనోపకరణాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు, అంగన్‌వాడీ ప్రీ స్కూల్ విద్యార్థులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, సీడీపీఓ అన్నపూర్ణ, ఐటీడీఏ ఏఎంఓ శాంతకుమారి, సమగ్ర శిక్ష ఏపీఓ ప్రసాద్, ఏఎంఓ సుధీర్‌బాబు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ల బదిలీ


నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే గ్రేడ్-2 హెడ్‌మాస్టర్లను బదిలీ చేయగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా 1,655 మంది స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌కు సంబంధించి 604 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజస్‌కు సంబంధించి 608 మంది ఉన్నారు. మొత్తం 1,210 మంది బదిలీ అయ్యారు. అదేవిధంగా రిక్వెస్ట్ బదిలీలకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌కు సంబంధించి 226 మంది, నాన్ లాంగ్వేజెస్‌కు సంబంధించి 219 మంది ఉన్నారు. వీరంతా వెంటనే రిలీవ్ అయి శనివారం ఆయా పాఠశాలల్లో చేరాలని డీఈఓ గంగాభవాని తెలిపారు.

11 లోపు సరుకులు తీసుకోవాలి

నెల్లూరు(టౌన్): పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ లోపు ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయూ వాహనాల నుంచి పాఠశాలల సిబ్బంది బియ్యం, రాగిపిండి, బెల్లం తదితర సరుకులను బయోమెట్రిక్ వేసి తప్పనిసరిగా తీసుకోవాలని డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరఫరాదారుల నుంచి కోడిగుడ్లు, చిక్కీలను సంబంధిత మండలాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వాటిని తీసుకుని వెంటనే ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలైనప్పటికీ అందుబాటులో ఉండి సరుకులు తీసుకోవాలని పేర్కొన్నారు.

బాబోయ్.. కార్పొ'రేటు'

విద్యను వ్యాపారం చేయకూడదనేది ప్రభుత్వ నిబంధన. అధిక ఫీజులు వసూలు చేయకూడదంటూ ప్రభుత్వం జీఓలు జారీ చేసినా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వాటిని లెక్కచేయడం లేదు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం.. ఇలా ప్రతి దానికీ ఇష్టారాజ్యంగా రేటు విధిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నాయి. తమ బిడ్డలకు మంచి చదువులు చెప్పించాలనే ఆలోచనతో తల్లిదండ్రులు కూడా ఏమీచేయలేని స్థితిలో వారు చెప్పిన ఫీజులు చెల్లిస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.



- ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు
- ఒక్కో తరగతికి రూ.20 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఫీజు
- ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యాసంస్థలు
- సొంత మెటీరియల్స్, యూనిఫాం, స్టేషనరీ విక్రయాలు
- ప్రతి ఏటా 15 శాతం నుంచి 30 శాతం ఫీజు పెంపు
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు

స్థానిక భక్తవత్సల నగర్‌కు చెందిన రామారావు (పేరు మార్పు) అన్నమయ్య సర్కిల్‌లోని ఓ కార్పొరేట్ పాఠశాలలో తమ ఇద్దరు పిల్లల్లో ఒకరిని 5వ తరగతి, ఇంకొకరిని 9వ తరగతిలో చేర్పించారు. 5వ తరగతికి రూ.42 వేల ఫీజు, పుస్తకాలకు రూ.9 వేలు, 9వ తరగతికి రూ.58 వేలు ఫీజు, పుస్తకాలకు రూ.11 వేలు చెల్లించాల్సి ఉంటుందని పాఠశాల సిబ్బంది చెప్పడంతో రామారావుకు గుండె ఆగినంత పనైంది.

జిల్లాలో..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల సంఖ్య	ప్రాథమిక పాఠశాలలు
812	285
యూపీ స్కూళ్లు	**హైస్కూళ్లు**
195	332

విద్యార్థుల సంఖ్య - 1.60 లక్షల మందికి పైగా..

అధిక ఫీజు వసూలు



ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం తదితర పేర్లతో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. బోధన కూడా క్వాలిఫైడ్ టీచర్లతో చేయించడం లేదు. ఫీజులు చెల్లించడం తప్ప పిల్లలకు నాణ్యమైన విద్య అందే పరిస్థితి లేదు. కార్పొరేట్ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లోనే బోధన బాగుంటుంది. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారు.

– వి.రంగయ్య, నెల్లూరు

నిబంధనలు పాటించాల్సిందే



ప్రతి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిందే. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలతోనే బోధన సాగించాలి. ఎక్కడా సొంత మెటీరియల్‌తో బోధన చేయకూడదు. ఫీజుల వివరాలను ప్రతి పాఠశాలలో డిస్‌ప్లే చేయాలి. పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ తదితరాలు విక్రయించకూడదు. తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.

– గంగాభవాని, డీఈఓ

నెల్లూరు(టౌన్): విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ వైపు చర్యలు చేపడుతున్నప్పటికీ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలతోనే బోధన చేయాలని నిబంధన ఉన్నా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు సొంత మెటీరియల్స్‌తో బోధన సాగిస్తున్నాయి. పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ తదితర సామగ్రిని పాఠశాలల్లో విక్రయించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసినా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు పట్టించుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది.

రూ.కోట్లలో వ్యాపారం

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి ఏటా రూ.వందల కోట్లలో లావాదేవీలు జరుగుతున్నాయి. సొసైటీ, ట్రస్ట్‌ల పేరుతో కుటుంబసభ్యులు, బంధువులతో కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందుతున్న పరిస్థితి ఉంది. అయితే ఈ లెక్కలను అటు వాణిజ్య పన్నుల శాఖ, ఇటు ఆదాయ పన్ను శాఖ అధికారులకు చూపిస్తున్న పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారిస్తే పన్ను రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

అధిక ఫీజులు దోపిడీ

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నీట్, ఐఐటీ, ఐఏఎస్, టెక్నో, ఒలింపియాడ్, సీ బ్యాచ్, ఎం బ్యాచ్ తదితర పేర్లతో తరగతులు నిర్వహిస్తున్నాయి. ఒక్కో పేరుకు ఒక్కో ఫీజు నిర్ణయించి విద్యార్థుల నుంచి కాసులు దండుకుంటున్నాయి. ఆయా పాఠశాలలు రూ.20 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలోని ఓ నాలుగైదు కార్పొరేట్ పాఠశాలల్లో 1వ తరగతికి రూ.లక్ష ఫీజు వసూలు చేస్తుండగా ఆ ఫీజును ప్రతి ఏటా 15 నుంచి 30 శాతం పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఫీజుల వివరాలను ఆయా పాఠశాలల్లో కచ్చితంగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా ఎక్కడా కనిపించని పరిస్థితి. పాఠశాలను బట్టి విద్యార్థుల నుంచి పుస్తకాల పేరుతో రూ.5 వేల నుంచి రూ.12 వేలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటు యూనిఫాం, బెల్టు, బూట్లు, స్టేషనరీ, ఐడెంటిటీ కార్డు తదితర పేర్లు చెప్పి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

చర్యలు శూన్యం

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పాఠశాలపై ఏమైనా ఫిర్యాదులు వస్తే మొక్కుబడిగా వెళ్లి తనిఖీలు చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజుల వసూలు, పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ విక్రయాలు జరుగుతున్నాయని తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రతి ఏటా గుర్తింపు రెన్యువల్‌కు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మామూళ్లు ఇస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యేక అవసరాల పిల్లలకు పటిష్ట శిక్షణ

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

వెంకటాచలం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సమాజంలో అందరితో సమానంగా జీవించేలా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. వెంకటాచలం మండలం ఎర్రగుంట వద్దనున్న దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాస, సాధికారిత సమ్మిళిత ప్రాంతీయ కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం అమలు చేస్తున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. కేంద్రంలోని వర్చువల్ రియాలిటీ రూం, ఆడియాలజీ, స్పీచ్ థెరపి, ఫిజియోథెరపి, క్లినికల్ అసిస్టెంట్ రూం, ఆల్బమ్ మేకింగ్ యూనిట్‌లను పరిశీలించి, శిక్షణ కార్యక్రమాలు ఎలా ఉన్నాయని పిల్లలు, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ పిల్లలు సమాజంలో అందరితో సమానంగా జీవించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్రం డైరెక్టర్ రాజ్ మణిపాల్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

పెన్నానదిలో ఇద్దరు యువకుల గల్లంతు

నెల్లూరురూరల్: నెల్లూరురూరల్ పరిధిలోని జొన్నవాడ ఆర్చి సమీపంలో పాత బ్రిడ్జి వద్ద ఇద్దరు యువకులు నీట మునిగి గల్లంతయ్యారు. నెల్లూరు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నెల్లూరు నగరంలోని భక్తవత్సలనగర్ ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు పెన్నానది వద్దకు వెళ్లగా వారిలో యుగేష్, సాయికిషోర్ నీటిలో మునిగి గల్లంతయ్యారు. తొలుత ఒకరు నీటిలో మునగగా ఇంకొకరు అతని కోసం దిగి గల్లంతయ్యాడని తెలిసింది. శుక్రవారం రాత్రి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. వీరంతా బీటెక్, డిగ్రీ చదువుతున్నారు.

12 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం

- త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెస్తాం
- ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జోనల్ చైర్మన్ సుప్రజారెడ్డి



ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, జోనల్ చైర్మన్ సుప్రజారెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు-తిరుపతి మధ్య నడిపేలా 12 ఎలక్ట్రిక్ బస్సులను ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జున్‌రెడ్డి, జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి శుక్రవారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ 2 డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొచ్చినట్లు తెలిపారు. కాలుష్య నివారణతోపాటు శబ్దం లేకుండా నడుస్తాయన్నారు. తిరుపతి నుంచి నెల్లూరుకు 6 బస్సులు, నెల్లూరు నుంచి తిరుపతికి 6 బస్సులు నిర్ణీత సమయంలో రాకపోకలు సాగిస్తాయన్నారు. ఇటీవల తిరుపతి, తిరుమల, కడప ప్రాంతాల మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రాష్ట్రంలో 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు తీసుకురావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, ఆయన ఆదేశాలతో 2,712 బస్సులను తీసుకురానున్నట్లు తెలిపారు. ఇప్పటికే 100 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెచ్చామని, త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా 53 వేల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఉద్యోగులు కష్టపడి ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. జోనల్ చైర్మన్ సుప్రజారెడ్డి మాట్లాడుతూ నూతన ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ ఆదమ్ సాహెబ్, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి పీవీ శేషయ్య, డిప్యూటీ సీటీఎం చిరంజీవి, ఒన్ డిపో మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కొట్టి.. పట్టా పట్టారు

రెవెన్యూలో కొంతమంది అవినీతి అధికారులు ముడుపులు తీసుకొని రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను అప్పనంగా ధారాదత్తం చేశారు. భూమి లేని నిరుపేదలు 10 సెంట్ల భూమి కోసం అర్థిస్తున్నా కనికరం కూడా చూపని వారు డబ్బు చేతికందగానే పట్టా చేతికి ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి అధికారపార్టీ నేతలు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను గుట్టుచప్పుడు కాకుండా బినామీ పేర్లతో నొక్కేశారు. ఇందుకు అప్పటి రెవెన్యూ అధికారులు సహకరించగా ఈ వ్యవహారం ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది.

- గత టీడీపీ ప్రభుత్వంలో భారీగా అక్రమాలు
- రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి డి ఫాం పట్టాలు
- నేతలకు సహకరించిన రెవెన్యూ అధికారులు
- తాజాగా వెలుగుచూసిన వైనం



వరికుంటపాడు మండలం విరువూరులో బోగస్ డి ఫాం పట్టాలు ఇచ్చిన భూమి

ఉదయగిరి, వరికుంటపాడు: 2019 ఫిబ్రవరిలో వరికుంటపాడు మండలం విరువూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 5, 6, 7లలో 28 ఎకరాలకుపైగా ఉన్న ప్రభుత్వ భూమిలో నిబంధనలకు వ్యతిరేకంగా 6 మంది పేర్లతో డి ఫాం పట్టాలు మంజూరు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇదంతా సాధారణ ఎన్నికలకు రెండు నెలల ముందు జరిగింది. ఈ భూములు పొందిన వారు బడాబాబులుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. దీని వెనుక అప్పటి అధికారపార్టీ ముఖ్యనేతలు ఉన్నారు. పట్టాల పత్రాలతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు తెలిసింది.

బోగస్ డి ఫాం పట్టాలు ఇవే

సర్వేనంబర్ 5-1లో దుగ్గినేని రమణమ్మ పేరుతో 4.90 ఎకరాలు, 5-2లో కోటిపాటి వెంకటేశ్వర్లు పేరుతో 4.80 ఎకరాలు, సర్వేనంబర్ 6-1లో చిరోళ్ల వెంకట భాగ్యలక్ష్మి పేరుతో 4.90 ఎకరాలు, 6-2లో 4.75 ఎకరాలు ఆత్మకూరు రోశయ్య పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సర్వేనంబర్ 7-1లో బొండిగల విజయమ్మ పేరుతో 4.24 ఎకరాలు, సర్వేనంబర్ 7-2, 7-3లో పందిటి అచ్చమ్మ పేరుతో మరో 4.92 ఎకరాలను డి ఫాం పట్టాలుగా ఇచ్చారు.

నిబంధనలకు వ్యతిరేకంగా..

ప్రభుత్వ భూమికి డి ఫాం పట్టా ఇవ్వాలంటే ఏ రెవెన్యూలో భూమి ఉందో ఆ గ్రామ నివాసి అయి ఉండాలి. పైగా భూమి లేని నిరుపేదగా ఉండి తెల్లరేషన్ కార్డు ఉండాలి. గ్రామసభ నిర్వహించి ఎలాంటి అభ్యంతరం లేకపోతే అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం పొంది డి ఫాం పట్టా మంజూరు చేయాలి. కానీ ఈ వ్యవహారంలో నిబంధనలు పాటించినట్లు ఎక్కడా కనిపించడం లేదు. ఈ పట్టాలన్నీ 2019 ఫిబ్రవరిలో మంజూరు చేసినవిగా స్పష్టమైంది. అప్పటి తహసీల్దార్ గొల్లపల్లి శ్రీనివాసులు మ్యుటేషన్ చేశారు. కానీ ఉదయగిరి నియోజకవర్గ అసైన్‌మెంట్ కమిటీ సమావేశం చివరిసారిగా 2012లో జరిగింది. అయితే 2019లో కమిటీ ఆమోదం లేకుండానే అధికారులు డి.పట్టాలు ఎలా ఇచ్చారో అంతుపట్టని పరిస్థితి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



ఆన్‌లైన్‌లో నమోదైన కోటపాటి వెంకటేశ్వర్లు డి ఫాం పట్టా

రూ.కోట్ల విలువ చేసే భూములు ధారాదత్తం

బోగస్ డి ఫాం పట్టాలు ఉన్న 28 ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.7 కోట్ల పైమాటే. పామూరు పట్టణానికి అతి సమీపంలో ఉండడం, ఈ భూములు సమీపంలో ప్రైవేట్ వెంచర్లు ఉండడం, అతి దగ్గరలోనే 164జీ జాతీయ రహదారి ఉండడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.

బోగస్ పట్టాలు రద్దు చేయాలి



2019లో కొంతమంది టీడీపీ నేతలు బినామీ పేర్లతో అప్పటి రెవెన్యూ అధికారుల సాయంతో నిబంధనలకు వ్యతిరేకంగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఆ భూమిలోకి రాలేదు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల పరిశీలనతో ఈ అవినీతి బయటపడింది. బోగస్ డి ఫాం పట్టాలు రద్దు చేసి సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– మురళీకృష్ణ, విరువూరు

విచారించి చర్యలు తీసుకుంటాం

బోగస్ పట్టాల విషయం కొంతమంది గ్రామస్తులు నా దృష్టికి తెచ్చారు. సమగ్రంగా విచారించి పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతాం. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– హమీద్, తహసీల్దార్, వరికుంటపాడు

14, 15 తేదీల్లో అడ్మిషన్ నోటిఫికేషన్



మాట్లాడుతున్న డా.ఎల్.విజయకృష్ణారెడ్డి

నెల్లూరు(టౌన్): అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 14, 15 తేదీల్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆ విశ్వవిద్యాలయ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సర్వోదయ కళాశాలలోని అభ్యాసక సహాయ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లొమో, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ పోర్టల్ www. braouonline. in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు ప్రింట్, సర్టిఫికెట్లతో తాము ఎంపిక చేసుకున్న అభ్యాసక సహాయ కేంద్రానికి వెళ్లి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఫీజులు, ఆయా ప్రోగ్రామ్స్ కాలపరిమితి, అర్హత తదితర వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలోని 179 అభ్యాసక సహాయ కేంద్రాల్లో బోధించేందుకు అర్హులైన అధ్యాపకులు, పరిశోధకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ పిచ్చయ్య, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతి రాక నేడు

నెల్లూరు(దర్గామిట్ట): దేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జిల్లాకు రానున్నారు. శనివారం నుంచి 14వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు జిల్లా పౌర సంబంధాల శాఖ డీడీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకయ్యనాయుడు 10న రాత్రి 7 గంటలకు రైలు మార్గంలో నెల్లూరుకు చేరుకుంటారు. 11న నర్రవాడ వెంగమాంబ తిరునాళ్లకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం ఉదయగిరి ప్రజలు నిర్వహించే ఆత్మీయ సమావేశంలో పాల్గొని తిరిగి నెల్లూరుకు వెళ్తారు. 12న కస్తూరి దేవి స్కూల్ ప్రాంగణంలోని డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ భవనంలో గురువుకు వందనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. వారి గురువు మోపూరు వేణుగోపాలయ్య స్మృతి సంచికను ఆవిష్కరిస్తారు. రాత్రి వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో బస చేస్తారు. 13న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహించే ఎన్టీఆర్ శతజయంతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. 14న రాత్రి 8 గంటలకు రైలు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్తారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- ఇద్దరికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగంతో టిప్పర్ మోటార్‌బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల సమీప జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. ఉస్మాన్‌సాహెబ్‌పేట రామ్‌నగర్‌కు చెందిన కె.అఖిల్, వై.జశ్వంత్ బంధువులు. పక్క, పక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. అఖిల్ తొమ్మిదో తరగతి చదువుతుండగా, జశ్వంత్ ఇంటర్మీడియట్‌లో చేరాల్సి ఉంది. ఇద్దరూ పద్మావతి గ్రీన్‌సిటీలో క్రికెట్ ఆడేందుకు శుక్రవారం ఉదయం బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరారు. ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారి దాటుతుండగా కావలి వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ బైక్‌ను వేగంగా ఢీకొంది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. బైక్ నడుపుతున్న అఖిల్ కుడి చేతికి, ఎడమ కాలికి తీవ్రంగా, జశ్వంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అఖిల్ ఎడమ మోకాలి దిగువ భాగాన్ని, కుడి మోచేతి భాగాన్ని తొలగించారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, ఎస్సై అంకమ్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత తల్లిదండ్రులు హాస్పిటల్‌కు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 167
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 310
లేయర్ చికెన్	: 178



యువతకు ఉపాధి అవకాశాలు

- కలెక్టర్ హరినారాయణన్



ఆశ్రమ వైద్యశాల సేవలను కలెక్టర్‌కు వివరిస్తున్న ఈఓ

వెంకటాచలం: డిమాండ్ ఉన్న వృత్తి నైపుణ్య కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మండలంలోని గొలగమూడిలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఇస్తున్న శిక్షణను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి పరిస్థితులకు అనుగుణంగా యువతకు ఉపయోగపడే కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన వారికి వివిధ రకాల సాంకేతిక నైపుణ్యాలను నేర్పించి పెద్ద కంపెనీల్లో ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. కళాశాలలో చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు, యువతకు కల్పించిన ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విజయ్ వినీల్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు.

వెంకయ్యస్వామి ఆశ్రమ సందర్శన

గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమానికి కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం విచ్చేశారు. స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విద్యాలయం, వైద్యశాల, యాత్రికుల వసతి సముదాయం, నిత్యాన్నదానశాలను పరిశీలించారు. పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

స్నేహితుల మధ్య ఘర్షణ.. ఒకరి హత్య



జామాయిల్ తోటలో హనుమంతరావు మృతదేహం

కందుకూరు: మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన ఘర్షణ ఒకరి హత్యకు దారి తీసింది. ఈ ఘటన శుక్రవారం గుడ్లూరు మండలంలోని పాజర్ల గ్రామంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాజర్ల గ్రామానికి చెందిన పాటి హనుమంతురావు (50)కు భార్య నాగమ్మ, ముగ్గురు కుమార్తెలున్నారు. తన అత్తగారి గ్రామమైన అల్లూరులో నివాసం ఉంటున్నారు. అతను బేల్దారి పనులు చేస్తున్నాడు. ఈనెల 4వ తేదీన పాజర్లలో పోలేరమ్మ తిరునాళ్లకు వచ్చాడు. హనుమంతరావుకు మద్యం తాగే అలవాటు ఉంది. అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడైన పాటి మహేష్‌తో కలిసి రెండు, మూడు రోజులుగా మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. గురువారం మూడు బస్తాల వడ్లను మిల్లులో మర వేయించేందుకు హనుమంతరావు, మహేష్ కలిసి బయలుదేరారు. ఆటోలో వడ్ల బస్తాలు వేసి బైక్‌పై అనుసరిస్తున్నారు. పోట్లూరు వద్దకు వెళ్లిన తర్వాత ఆటో ఆపి ఒక బస్తా వడ్లను చరణ్ అనే వ్యక్తికి అమ్మేశారు. వచ్చిన డబ్బుతో అక్కడే మద్యం కొనుగోలు చేసి సమీపంలోని జామాయిల్ తోటలోకి వెళ్లి తాగారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటలు పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఆవేశంలో మహేష్ రాయి తీసుకుని హనుమంతరావు ముఖంపై బలంగా కొట్టాడు. దీంతో అతను పెద్దబండపై పడి తలకు బలమైన గాయమై మరణించాడు. మహేష్ బైక్ తీసుకుని ఊర్లోకి వచ్చాడు. హనుమంతరావు గురించి అతని అమ్మ సుబ్బమ్మ ప్రశ్నించగా తాగి రోడ్డు పక్కన పడిపోయి ఉన్నాడని చెప్పాడు. దీంతో ఆలస్యంగానైనా వస్తాడని ఆమె భావించింది. శుక్రవారం ఉదయం పోట్లూరు గ్రామానికి చెందిన కొందరు జామాయిల్ తోట వైపు వెళ్లారు. అక్కడ మృతదేహాన్ని చూసి వలంటీర్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హనుమంతరావుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో అసలు విషయం వెలుగు చూసింది.

గుడ్లూరులో వలేటివారిపాలెం వాసి మృత్యువాత



కొండయ్య మృతదేహం

కందుకూరు: వలేటివారిపాళెం మండలం చుండిఅయ్యవారిపల్లెకు చెందిన చుండూరి కొండయ్య (25) అనే యువకుడు శుక్రవారం గుడ్లూరులో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొండయ్య కూలి పనులు చేస్తుంటాడు. శుక్రవారం ఉదయం గుడ్లూరు మండలంలోని అడవిరాజుపాళెంలో ఉంటున్న తన అక్క వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఈ క్రమంలో గుడ్లూరుకు చేరుకుని మద్యం షాపునకు వెళ్లాడు. బాగా తాగి నడవలేని స్థితిలో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి లేపి ఎండ ఎక్కువగా ఉందని, వెళ్లి ఎక్కడైనా చెట్టు కింద పడుకోవాలని సూచించారు. అయితే పూర్తిగా స్పృహ కోల్పోయిన స్థితిలో పడుకుండిపోయాడు. సాయంత్రం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ఎస్సై రాము లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

నిమ్మధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 40
సన్నవి	: రూ. 25
పండ్లు	: రూ. 10

వివాహిత ఆత్మహత్య

జలదంకి: విష గుళికలు తిని పానేటి వెన్నెల (30) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. జలదంకి పోలీసుల కథనం మేరకు.. వేములపాడుకు చెందిన పానేటి వెంకటేశ్వర్లు, వెన్నెల భార్యాభర్తలు. వారికి ముగ్గురు కుమారులున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం వెన్నెల భర్త ఇంట్లో లేని సమయంలో విష గుళికలు తిని అపస్మారక స్థితికి చేరింది. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను కావలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహాన్ని వేములపాడుకు తీసుకురాగా జలదంకి పోలీసులు గురువారం సాయంత్రం పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈకేవైసీ నమోదు చేసుకోండి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల కోసం శని, ఆదివారాల్లో ట్రెజరీ కార్యాలయాల్లో ఈకేవైసీ నమోదు చేస్తున్నారని డివిజనల్ ఉప ఖజానా కార్యాలయాధికారి షేక్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కలిగిరి: మండలంలోని పడమర గుడ్లదొన గ్రామంలో ఉన్న మామిడితోటలో కాపలా ఉంటున్న తలపల తిరుపతి (60) అనే వ్యక్తి శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. జలదంకి మండలం కొత్తపాళెనికి చెందిన తిరుపతి మామిడి తోటలోని బోరు వద్ద మోటార్‌కు ఉన్న వైర్లు సరి చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. తోట నిర్వాహకులు, బంధువులు తిరుపతి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న సెబ్ ఈఎస్ రవికుమార్

ఉదయగిరి: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ ఈఎస్ రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గండిపాళెంలో ఓ నిర్మాణానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సెబ్ సిబ్బంది దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను వదిలేసి, మరో రెండు ట్రాక్టర్లకు నామమాత్రంగా జరిమానా విధించిన వైనంపై శుక్రవారం సాక్షిలో పట్టుకున్నారు.. వదిలేశారు అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఈఎస్, ఏఈఎస్ శుక్రవారం పిల్లాపేరు, సదరు నిర్మాణాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నాడు - నేడులో జిల్లాకు ప్రథమ స్థానం

నెల్లూరు(టౌన్): రెండో విడత మనబడి నాడు – నేడు పనుల్లో రాష్ట్రంలో నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తెలిపారు. నెల్లూరులోని సమగ్రశిక్ష కార్యాలయంలో శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 1,374 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, తాగునీరు, తదితర 9 రకాల పనులను చేపట్టినట్లు తెలిపారు. పనుల పురోగతిలో 64.41 పాయింట్లతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పునః ప్రారంభం నాటికి పనులు పూర్తి చేసి పాఠశాలలను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ చొరవతో జిల్లాలో 18 ఏళ్ల లోపు ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి వివిధ శాఖల సమన్వయంతో డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. ఆధార్‌కార్డు లేని వారికి ప్రత్యేకంగా కార్డును నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. వారి పరిస్థితిని బట్టి స్థానికంగా ఉన్న పాఠశాలల్లో విద్యాబోధనతోపాటు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 30వ తేదీలోపు అన్ని ప్రాంతాల్లో బడి బయట పిల్లలను గుర్తించనున్నట్లు తెలిపారు.